సాక్షి
తిరుపతి
బుధవారం। 4। జనవరి। 2023

తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.57,410
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,128

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,800
రిటైల్ వెండి గ్రాము	రూ.73.80

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	29	20
చిత్తూరు	29	18
తిరుమల	24	16
గూడూరు	31	22
నగరి	30	20

పోలీస్ 30 యాక్ట్ అమలు

తిరుపతి క్రైమ్: జిల్లాలో పోలీసుల అనుమతి లేనిదే ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఇప్పటికే పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉందని, పోలీసుల అనుమతి లేనిదే ఎవరూ సభలు, సమావేశాలు, రోడ్‌షోలు, ధర్నాలు నిర్వహించరాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన నేపథ్యంలో కుప్పం నియోజకవర్గ ప్రజలు హడలిపోతున్నారు. ఆయన పాదం పెట్టిన చోటల్లా అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. మొన్న నెల్లూరు జిల్లా కందుకూరులో ఎనిమిది మంది, నిన్న గుంటూరు ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంపై మదనపడుతున్నారు. ఇప్పుడు కుప్పం వస్తే ఎలాంటి అనర్థాలు జరుగుతాయోనని చర్చించుకుంటున్నారు. స్థానికులనే కాకుండా.. టీడీపీ నేతలు సైతం ఎప్పుడు.. ఎలాంటి ఘటనలు ఎదురవుతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయంపై టీడీపీ ముఖ్యనేతలు వరుసగా రెండు రోజులు సమావేశాలు నిర్వహించి.. 'మనకు ఇదేం ఖర్మరా బాబూ' అంటూ విస్మయం వ్యక్తం చేసినట్టు సమాచారం.



మాకు.. ఇదేం ఖర్మరా బాబు!

కుప్పంలో భయం భయం

- నేటి నుంచి చంద్రబాబు పర్యటన
- హడలిపోతున్న స్థానికులు
- కందుకూరు, గుంటూరు ఘటనలను గుర్తుచేసుకుంటున్న వైనం
- ఎలాంటి ఘటనలు ఎదురవుతాయోనని ఆందోళన

సాక్షి ప్రతినిధి, తిరుపతి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఖరారైంది. బుధ, గురు, శుక్రవారాల్లో ఆయన కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బాబు పర్యటన షెడ్యూల్ ఇప్పటికే పలుమార్లు ఖరారైనా స్థానిక నేతలు సుముఖంగా లేకపోవడం.. జన సమీకరణకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో వాయిదాలు పడుతూ వచ్చింది. జన సమీకరణ, పర్యటన ఖర్చులు పార్టీ శ్రేణులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేయడంతో తప్పని పరిస్థితుల్లో ఒప్పుకున్నట్లు టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

వస్తే.. గమ్మనుండదుగా?

గతంలో చంద్రబాబునాయుడు తన నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించిన సమయంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి అలజడి సృష్టించారు. ప్రశాంతంగా ఉన్న కుప్పంలో చిచ్చుపెట్టి కేసులు పెట్టే స్థాయికి తెచ్చారు. అనుచిత వ్యాఖ్యలతో జనాన్ని ఉసిగొలిపి కొట్లాటలకు కారణమయ్యారు. పచ్చని పల్లెల్లో వర్గవైషమ్యాలు సృష్టించి వేడుక చూసి వెళ్లిపోయారు. ఇప్పుడు మళ్లీ ఎలాంటి వ్యాఖ్యలు చేస్తారో.. ఎవరెవరిని ఉసిగొల్పుతారో.. ఈ పర్యటన ఎక్కడికి దారితీస్తుందోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏదో ఒకచోట తాను చెప్పాల్సింది చెప్పి వెళ్లితే బాగుంటుందని హితవు పలుకుతున్నారు.

ఇవి గుర్తులేవా తమ్ముళ్లూ?

- చుట్టపుచూపుగా వచ్చి వెళ్లే చంద్రబాబునాయుడు తన నియోజకవర్గం కుప్పంలో ఇల్లుకూడా నిర్మించుకోలేదు.
- తాగు, సాగునీటి ఇబ్బందులు వెంటాడుతున్నా స్థానికులను పట్టించుకోలేదు.
- హంద్రీ–నీవా నీటిని కుప్పానికి తీసుకొస్తామని ప్రగల్భాలు పలికి మిన్నకుండిపోయారు.
- వృథాగా తమిళనాడుకెళ్తున్న పాలారు నీటికి అడ్డుకట్ట వేయలేకపోయారు.
- కుప్పాన్ని మున్సిపాలిటీ కాదుకదా.. కనీసం రెవెన్యూ డివిజన్ కూడా చేయలేకపోయారు.
- రైల్వే అండర్‌బ్రిడ్జిలు, రోడ్ల అభివృద్ధిని అటకెక్కించారు.
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కలగానే మిగిల్చారు.

నారా పాదం..జనానికి శాపం



చంద్రబాబు ప్రచార ఆర్భాటానికి జనాన్ని బలిపశువులు చేస్తున్నారని జనం గట్టిగా నమ్ముతున్నారు. గోదావరి పుష్కరాల్లో ఫొటో షూట్ కోసం 28 మంది.. ఇటీవల నెల్లూరు జిల్లా కందుకూరులో ఎనిమిది మందిని పొట్టనబెట్టుకోవడం చూస్తే ఆయన పాదం మామూలుది కాదని స్థానికులు చెప్పుకుంటున్నారు. అలాగే గుంటూరులో కానుకలను ఎరవేసి ముగ్గురి ప్రాణాలను హరించేశాడని గుర్తుచేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కుప్పం పర్యటన ఖరారు కావడంతో స్థానికులు 'ఐరన్ లెగ్' వ్యాఖ్యలపై చర్చించుకుంటున్నారు. పబ్లిసిటీ కోసం బలవంతంగా జనాన్ని తరలించి చంపేస్తారేమోనని భయపడుతున్నారు. పర్యటనను వాయిదా వేసుకోమని టీడీపీ శ్రేణులు బ్రతిమలాడినట్లు విశ్వసనీయ సమాచారం. అందుకు చంద్రబాబు ససేమిరా అనడంతో చేసేదిలేక సభలకు ఓకే అన్నట్టు సమాచారం.

ద్వాదశి చక్రస్నానం.. పరవశించిన భక్తజనం





తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. శ్రీవారి పుష్కరిణిలో ఉదయం స్నపన తిరుమంజనం, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. – తిరుమల

తుమ్మలగుంటలో ద్వాదశి రద్దీ



శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి

10లో

రాష్ట్రంలో యువతకు ప్రాధాన్యం



జ్యోతి ప్రజ్వలనలో మంత్రి ఆర్కే రోజా, ఎంపీ గురుమూర్తి తదితరులు

10లో

క్లుప్తంగా

విద్యుత్‌ తీగ తగిలి వ్యక్తి మృతి


సతీష్‌

చంద్రగిరి: ప్రమాదవశాత్తు విద్యుత్‌ తీగలు తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని శేషాపురం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. చంద్రగిరి కొత్తపేటకు చెందిన సతీష్‌(47) కేబుల్‌ ఆపరేటర్‌. మంగళవారం సాయంత్రం శేషాపురం వద్ద కేబుల్‌ వైరు లాగుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌ లైను తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్‌ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. సతీష్‌ కుటుంబానికి ఆయన సంతాపం తెలియజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాగులో పడి మహిళ మృతి


గుర్తు తెలియని మహిళ మృతదేహం

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తమ్మినపట్నం పంచాయతీ పరిధిలోని వాగులో మంగళవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించింది. వివరాలు.. గ్రామానికి సమీపంలో ఉన్న సింగేటి వాగులో సుమారు 40 ఏళ్ల వయసుగల గుర్తుతెలియని మహిళ మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారంతో ఎస్‌ఐ గోపాల్‌ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. క్రిష్ణపట్నం ఓడరేవుకు కేటాయించిన ప్రాంతంలో పనిచేస్తున్న కార్మిక కుటుంబాలకు చెందిన వారై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పేదల జీవితాలకు వెన్నుదన్ను

- వారి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- పింఛన్‌ కానుక సభలో డెప్యూటీ సీఎం


హాజరైన లబ్ధిదారులు, అధికారులు


పింఛన్‌ కానుక నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

తిరుచానూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదల జీవితాలకు వెన్నుదన్నుగా నిలుస్తోందని ఉపముఖ్యమంత్రి కే.నారాయణస్వామి తెలిపారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రాజమండ్రి నుంచి వైఎస్సార్‌ పింఛన్‌ కానుక, పెంచిన మొత్తాన్ని, కొత్త పింఛన్లను ప్రారంభించగా అదే సమయంలో ఎస్వీ యూనివర్సిటీ ఆడిటోరియంలో జిల్లా స్థాయి పింఛన్ల కానుక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపముఖ్యమంత్రితోపాటు తిరుపతి ఎంపీ డాక్టర్‌ గురుమూర్తి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆదిమూలం, నగర మేయర్‌ డాక్టర్‌ శిరీష, కలెక్టర్‌ కే.వెంకటరమణారెడ్డి, కమిషనర్‌ అనుపమ అంజలి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని తూచాతప్పకుండా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరిస్తున్నారని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాలకు వెళుతుంటే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు.

తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా పింఛన్లు తొలగించ లేదని, కానీ విపక్షాలు పనిగట్టుకుని చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని సూచించారు. 16 ఏళ్ల క్రితం రూ.50 ఇస్తున్న పెన్షన్‌ మొత్తాన్ని ఏకంగా రూ.200లు చేసి అమలు చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖరరెడ్డికే దక్కుతుందన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రెండడుగులు ముందుకేసి పింఛన్‌ మొత్తాన్ని రూ.2,750కి పెంచినట్టు తెలిపారు. సంక్షేమ పథకాలకు సంబంధించి ఒక్క తిరుపతి నియోజకవర్గంలోనే దాదాపు రూ.900 కోట్లను పేదల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు.

ఏటా పింఛన్‌ పెంపు

ప్రభుత్వ విప్‌ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అభాగ్యులకు అండగా నిలిచే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన ఏటా పింఛన్‌ మొత్తాన్ని పెంచుతూ వచ్చే ఏడాదికి రూ.3000 చేయనున్నట్టు వెల్లడించారు. అనంతరం నగర మేయర్‌ శిరీష, కలెక్టర్‌ కే.వెంకటరమణారెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పీడీలు, డీఆర్డీవోలు జ్యోతి, రాధమ్మ, డెప్యూటీ కమిషనర్‌ చంద్రమౌళీశ్వరరెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జిల్లా సమాచారం

నియోజకవర్గం	కొత్త పింఛన్లు
చంద్రగిరి	1,333
గూడూరు	1,303
నగరి	404
సత్యవేడు	1,100
శ్రీకాళహస్తి	1,274
సూళ్లూరుపేట	1,274
తిరుపతి	734
వెంకటగిరి	648
మొత్తం	**8,070**

వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకే హత్య


హత్య కేసులో నిందితులను అరెస్టు చేసి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

- రెండు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు
- రివార్డులతో అభినందించిన డీఎస్పీ

నాయుడుపేట టౌన్‌: వివాహేతర సంబంధంపై నిలదీసినందుకే కక్షగట్టి నాయుడుపేట పట్టణానికి చెందిన యువకుడు వెలూరు వెంకటేష్‌(25)ను కత్తితో పొడిచి అతి కిరాతకంగా హత్యచేశారని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి వెల్లడించారు. ఈ హత్య కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను మంగళవారం సాయంత్రం పట్టుకుని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో నిందితులను హాజరుపరిచి వివరాలను వెల్లడించారు. ఆయన కథనం.. పట్టణంలోని అమరా గార్డెన్‌ వీధిలో నివాసం ఉంటున్న వెలూరు శ్రీనివాసులు, గీతమ్మకు కుమార్తె నవ్య, కుమారులు వెంకటేష్‌, నరేంద్రసాయి పిల్లలు ఉన్నారు. కుమార్తెకు పదేళ్ల కిందట వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవలు రావడంతో తిరిగి పుట్టింటికి వచ్చేసింది. ఈ క్రమంలో అదే ప్రాంతంలో ఉంటున్న పయ్యాల హరితో నవ్యకు పరిచయం ఏర్పడింది. రెండేళ్ల కిందట అతనితోవెళ్లి పోయింది. వెంకటేష్‌ అతని సోదరుడు నరేంద్ర సాయిలకు విషయం తెలిసి హరిని పలు మార్లు నవ్య ఆచూకీ చెప్పాలని నిలదీయడంతో వారి మధ్య గొడవలు జరిగాయి. కక్షగట్టిన హరి, నవ్య సోదరులను అంతమొందించాలని పథకం వేశాడు. ఈ క్రమంలోనే జనవరి 1 తేదీ తెల్లవారుజామున పట్టణంలోని పాగొట్టం కాలనీలో ఉన్న స్నేహితులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి వెంకటేష్‌ తిరిగి వస్తున్నాడు. అదేసమయంలో అక్కడే కాపు కాచి ఉన్న అతనిపై కక్షగట్టిన హరితో పాటు అతని సోదరుడు గిరి వారి ముగ్గురు స్నేహితులు శ్రీనివాసులు, కుమార్‌, సునీల్‌ కలిసి మూకుమ్మడిగా వెంకటేష్‌పై దాడి చేసి విచక్షణారహితంగా హత్య చేశారు. ఈ కేసును సీఐ ప్రభాకర్‌రావు సారథ్యంలో ఎస్‌ఐ శ్రీకాంత్‌ ఐడీ పార్టీ పోలీసులు ఛేదించారు. పరారీలో ఉన్న ఐదుగురు నిందితులను పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న శివాలయం వద్ద మంగళవారం సాయంత్రం పట్టుకుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను రెండు రోజుల వ్యవధిలోనే పట్టుకున్న సీఐ, ఎస్‌ఐలతో పాటు ఐడీ పార్టీ హెడ్‌కానిస్టేబుల్‌ షేక్‌ కరీమ్‌, చిరంజీవి, హోంగార్డు డక్కిలి వెంకి తదితరులకు రివార్డులతో డీఎస్పీ అభినందించారు.

వైఎస్సార్‌సీపీని అందరికీ చేరువ చేసేందుకు కృషి


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: నియోజకవర్గంలో ప్రతి కుటుంబానికి వైఎస్సార్‌సీపీని మరింత చేరువచేసేందుకు కృషిచేస్తానని పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన సందర్భంగా మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా అన్ని వర్గాల అభ్యున్నతికి కృషిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన ప్రతి కార్యక్రమాన్ని శక్తివంచన లేకుండా విజయవంతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను ఎప్పటికప్పుడు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళుతానని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తడ: తడ పంచాయతీ, సుజాతా నగర్‌ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాదవరం కోదండం(59) మృతి చెందాడు. ఎస్‌ఐ జేపీ శ్రీనివాసరెడ్డి కథనం.. చెత్త కాగితాలు, ఇనుప వస్తువులు ఏరుకుని జీవించే తడ పంచాయతీ, పల్లెపాళెం గ్రామానికి చెందిన కోదండం ఎప్పటిలాగే పనిముగించుకుని ఇంటికి చేరుకునేందుకు రోడ్‌డ్‌ దాటుతున్నాడు. ఇదే సమయంలో చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్లే మినీ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కోదండం సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రూ.8 కోట్లతో భూగర్భ విద్యుత్‌లైన్‌


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు

- భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని నాలుగు మాడవీధుల్లో రూ.8 కోట్లతో భూగర్భ విద్యుత్‌ లైన్‌ పనులకు మంగళవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆశీర్వాదంతో నాలుగు మాడవీధుల్లో భూగర్భ విద్యుత్‌ లైన్‌ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. 2020 మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం నాడు జరిగిన సంఘటన తనను తీవ్రంగా బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో ప్రముఖుల సహకారంతో పట్టణంలోని నాలుగు మాడవీధుల్లో పనులు ప్రారంభించినట్టు పేర్కొన్నారు. రూ.8 కోట్ల వ్యయంతో చేసే ఈ పనులను 40 రోజుల్లో పూర్తిచేస్తామన్నారు. ఇందుకు సహకరించిన నాలుగు మాడవీధుల్లోని అన్ని వర్గాల వారికి ధన్యవాదాలు తెలిపారు. దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేర అండర్‌ ఫోర్‌ కేబుల్‌ పనులు జరుగుతాయని తెలిపారు. పాలకమండలి చైర్మన్‌ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మడి బాలకృష్ణయ్య, లోకేష్‌యాదవ్‌, చంద్రయ్యశెట్టి, ఉత్తరాజి శరవణ, కంఠా ఉదయ్‌కుమార్‌, నాని, నంద, సుమతి, సునీతాసింగ్‌ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన ఆర్థిక భరోసా


చెక్కును అందిస్తున్న ప్రభుత్వ విప్‌ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పక్కన సర్పంచ్‌ కోటేశ్వరరావు

తిరుపతి రూరల్‌: అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు మెరుగైన ఆర్థిక భరోసా సీఎం రిలీఫ్‌ ఫండ్‌ అని ప్రభుత్వ విప్‌, తుడా చైర్మన్‌ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి రూరల్‌ మండలం, లింగేశ్వరనగర్‌ పంచాయతీకి చెందిన శోభ అనారోగ్యంతో బాధపడుతోంది. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం రూ.1.2 లక్షలను మంజూరు చేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మంగళవారం తుమ్మలగుంటలో శోభ కుటుంబ సభ్యులకు చెవిరెడ్డి అందించారు. లింగేశ్వరనగర్‌ సర్పంచ్‌ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రెస్‌ అకాడమీ చైర్మన్‌కు సాదర స్వాగతం


కొమ్మినేనికి స్వాగతం పలుకుతున్న బాలకొండయ్య

రేణిగుంట: రాష్ట్ర ప్రెస్‌ అకాడమీ చైర్మన్‌ కొమ్మినేని శ్రీనివాసరావుకు మంగళవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. రెండు రోజుల తిరుపతి, తిరుమల పర్యటన నిమిత్తం ఇక్కడకు చేరుకున్న ఆయనకు జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి బాలకొండయ్య పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు బయల్దేరి వెళ్లారు.

వైకుంఠ ద్వార దర్శన టోకెన్‌ జారీ కేంద్రాల కుదింపు

తిరుపతి అలిపిరి: తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి తిరుపతిలో తొమ్మిది కేంద్రాల్లో టోకెన్లు జారీచేస్తున్న విషయం విదితమే. ఈనెల 4వ తేదీ బుధవారం నుంచి నాలుగు కేంద్రాల్లో మాత్రమే ఈ టోకెన్లు జారీ చేస్తారని అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌, ఆర్టీసీ బస్టాండ్‌ ఎదురుగా ఉన్న శ్రీనివాసం, రైల్వే స్టేషన్‌ ఎదురుగా ఉన్న విష్ణునివాసం, రైల్వే స్టేషన్‌ వెనుక వైపు ఉన్న 2వ సత్రం (గోవిందరాజ స్వామి సత్రాలు) కేంద్రాల్లో వైకుంఠ ద్వార దర్శన టోకెన్లు జారీచేస్తారు. భక్తులు ఈ విషయాన్ని గమనించగలరని టీటీడీ విజ్ఞప్తిచేసింది.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ

- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు


అపస్మారక స్థితిలో పడిఉన్న క్షతగాత్రులు


హోటల్‌ యజమాని కారు

శ్రీకాళహస్తి రూరల్‌: ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొని ఎనిమిది మందికి తీవ్ర గాయాలైన సంఘటన శ్రీకాళహస్తి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్‌ ఎస్‌ఐ వెంకటేష్‌ కథనం.. శ్రీకాళహస్తి పట్టణంలోని దర్గావీధికి చెందిన బాబు(50)కి అనారోగ్యంగా ఉండడంతో రేణిగుంట సమీపంలో ఉన్న ఓ ప్రయివేటు ఆస్పత్రికి కారులో కుటుంబ సభ్యులు తీసుకెళ్తున్నారు. అదే సమయంలో శ్రీకాళహస్తి పట్టణంలో కనిష్క హోటల్‌ నిర్వహిస్తున్న యజమాని ప్రవీణ్‌(45) తిరుపతి నుంచి తన కారులో శ్రీకాళహస్తికి బయలుదేరాడు. మండలంలోని పూతలపట్టు–నాయుడుపేట ప్రధాన రహదారి, చల్లపాళెం బీసీకాలనీ వద్ద ప్రవీణ్‌ శ్రీకాళహస్తి వైపు వెళ్తున్న మరో వాహనాన్ని ఓవర్‌టేక్‌ చేయబోయి ఎదురుగా రేణిగుంట ఆస్పత్రికి వస్తున్న కారును ఢీకొట్టాడు. దీంతో ఆ కారు డ్రైవర్‌ కాలేషా(45), బాబు(50) ఆషా(31), ముస్సీర్‌(28), యాస్మిన్‌(27), హుస్సేన్‌(12), సనా(03)కు తీవ్రగాయాలయ్యాయి. ప్రవీణ్‌ సైతం తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను 108 సిబ్బంది శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్‌ చేశారు.

ద్వాదశి చక్రస్నానం.. పరవశించిన భక్తజనం

ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో చక్రస్నానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 5 నుంచి 6 గంటల మధ్య పుష్కరిణిలో చక్రస్నాన ఘట్టాన్ని పూర్తిచేశారు. భక్తులు వీక్షించి తరించారు. ఇదిలావుండగా ద్వాదశి పర్వదినాన ఉత్తర ద్వారంగుండా ఆలయ ప్రవేశం చేసి స్వామివారిని దర్శించుకుంటే మోక్షం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎక్కడ చూసినా బారులు తీరి కనిపించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టారు.

- తిరుమల


హారతిగైకొనుమా : ఆలయం వద్ద హారతి ఇస్తున్న అర్చకులు


పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు..


చక్రత్తాళ్వార్‌ ఊరేగింపులో టీటీడీ చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి దంపతులు


ఆలయం వద్ద చక్రత్తాళ్వార్‌కు హారతి


ద్వాదశి రద్దీ